క్లుప్తంగా

సమిత్వ సర్వే పరిశీలన



దుగ్గిరాల: తెనాలి డివిజన్ పరిధి 5 మండలాలలోని 54 గ్రామాలు, 36 రెవెన్యూ గ్రామాల్లో 76 ప్రత్యేక టీంలతో సర్వే నిర్వహిస్తున్నట్లు డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి కె.శ్రీదేవి తెలిపారు. సోమవారం దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో సమిత్వ సర్వేను ఆమె పరిశీలించి మాట్లాడారు. మొత్తం 61 వేలకు గాను 26 వేల గృహాలకు సర్వే పూర్తయ్యిందని.. ప్రతి రోజు 50–70 గ్రౌండ్ ట్రూథింగ్ పూర్తి చేసి పోర్టల్‌లో నమోదు చేయ్యాలంటూ జేసీ ఆదేశాలు ఇచ్చారని వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వి.చంద్రమోహన్ డిప్యూటి ఎంపీడీవో కె.జె.నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ గురువులను గౌరవించాలి



తాడేపల్లి రూరల్: విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని విజయవాడ లైన్స్ క్లబ్ జోన్ చైర్మన్ గుప్తా అన్నారు. తాడేపల్లి మండలంలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విజయవాడ లైన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో అక్షరాస్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ తెలుగు ఉపాధ్యాయుడు శ్రీలక్ష్మీనరసింహమూర్తిని ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. అలానే పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో డీసీ లైన్ జవహర్, లైన్ డీసీ నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

279వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు



తాడేపల్లి రూరల్: తమకు రావాల్సిన బకాయిల కోసం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు సోమవారం నాటికి 279వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ కార్యదర్శి కె.స్టీవెన్, కార్మికులు కె.ఆదినారాయణ, ఎం.గురవయ్య, ఎస్.సుబ్బారావు ప్రారంభించారు. దీక్షలో మల్లె శివకుమారి, వై.రమాదేవి, ఈ.శారమ్మ, వి.రిబ్కా, డి.సువర్ణ కుమారి కూర్చున్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని పలువురు ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో బి.అంకయ్య, షేక్ సుభాని, వై.సాంబశివరావు, డి.మాణిక్యారావు, నాగమల్లీశ్వరి, ఈశ్వర్రావు, యహోషువ, వై.సుబ్బారావు, దానయ్య, తుపాకుల నాగేశ్వరావు, ఈ.నరసింహారావు, ఆశీర్వాదం, డి.నాగేశ్వరావు, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి వెలుగు

తెనాలి: ఒకరి నేత్రదానం ఇద్దరి జీవితాలకు వెలుగునిస్తుందని, ప్రతిఒక్కరూ నేత్రదానంపై అవగాహన కలిగి అంధత్వ నివారణకు తమవంతు కృషిచేయాలని చెన్నైకు చెందిన డాక్టర్ అగర్వాల్స్ ఐ బ్యాంక్ జనరల్ మేనేజర్ రాజీవ్ కుమార్ అన్నారు. పట్టణానికి చెందిన సామాజిక సేవాసంస్థ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ముగింపు సదస్సు సోమవారం స్థానిక బోసు రోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలలో జరిగింది. నెహ్రూనికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి అధ్యక్షత వహించారు. ధన్వంతరీ సంస్థకు చెందిన డాక్టర్ పి. భాస్కరరావు కంటినుండి కార్నియాను సేకరించే విధానాన్ని తెలియజేశారు. విజ్ఞానవేదిక ప్రధాన కార్యదర్శి కె. పుల్లారావు, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ అగర్వాల్స్ ఐ బ్యాంక్ మేనేజర్ ఆర్. పవన్‌కుమార్, కంటి చూపును కోల్పోయి డాక్టర్ అగర్వాల్స్ ఐ బ్యాంక్ కార్నియాతో ఉచితంగా కంటి చూపు పొందిన తెనాలికి చెందిన ఎం.శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. పాఠశాలకు చెందిన బాలబాలికలకు ఉచితంగా నేత్ర పరీక్షలు చేశారు.

కాలువలు నిర్మించాలి

తెనాలిఅర్బన్: 3వ వార్డు సిద్ధార్థ కాలనీలో మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామని.. వాటిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీనివాసరావు ప్రజల నుంచి వినతి పత్రాలు సేకరించారు.

కృష్ణ బలిజ సంఘం కోశాధికారిగా పిన్నారావు

తెనాలిటౌన్: రాష్ట్ర కృష్ణ బలిజ సంఘం కోశాధికారిగా తెనాలికి చెందిన అన్నం పిన్నారావు ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం కార్యవర్గ ఎన్నికను నిర్వహించారు. పిన్నారావుకు రాష్ట్ర నాయకులు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణబలిజ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆయనకు తెనాలికి చెందిన పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు నేడు

- ఎరువుల కొరతపై రైతన్నలకు అండగా కార్యక్రమాలు
- అధికారులకు అందజేయనున్న వినతిపత్రాలు



అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

దుగ్గిరాల: రైతన్నకు బాసటగా ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై వైఎస్సార్‌సీపీ అన్నదాత పోరు కార్యక్రమాన్ని మంగళవారం తెనాలి రెవెన్యూ డివిజన్‌లో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ దుగ్గిరాల మండల అధ్యక్షుడు తాడిబోయిన శివగోపయ్య సోమవారం తెలిపారు. దుగ్గిరాల మండల పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన అన్నదాత పోరు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రైతుల ఎదుర్కొంటున్న ఎరువుల కొరత, అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని కోరుతూ ధర్నా చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం తెనాలి సబ్ కలెక్టరుకు రైతు సమస్యలపై వినతిపత్రం ఇవ్వనున్నామని.. మండల, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జి.గంగాధర్‌రావు, పి.సంసోనమ్మ, ఎస్.నాగేశ్వరరావు, కుర్రా జ్యోతి, టి.గంగాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులను అందజేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తెనాలిలో చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి కోరారు. సోమవారం తాడేపల్లి జాతీయ రహదారి వద్ద ఉన్న డీవీఆర్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. యూరియా కొరతతో అన్నదాతలు పడుతున్న ఇబ్బందులపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని రైతులు తెనాలిలోని రామలింగేశ్వరరావుపేట ఏ1 కన్వెన్షన్ వద్దకు మంగళవారం ఉదయం 8.30 గంటలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. తెనాలి ఏ1 కన్వెన్షన్ హాల్లో అల్పాహారం తీసుకుని అక్కడి నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని, రెవెన్యూ డివిజనల్ అధికారికి వినతిపత్రం అందజేస్తామన్నారు.

కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి..

మంగళగిరి, మంగళగిరి టౌన్: రైతు సమస్యలు, యూరియా కొరత, ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం తెనాలిలో నిర్వహించనున్న అన్నదాత పోరు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి రామలింగేశ్వర నగర్ ఏ1 కన్వెన్షన్‌కు ఉదయం 8.30 గంటలకు నియోజకవర్గం నుంచి రైతులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొని జయప్రదం చేసి ప్రభుత్వం కళ్లు తెరిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ హనుమంతరావు, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావులతో పాటు పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొంటారని తెలిపారు.

రోడ్డున పడుతున్న అన్నదాతలు..

తాడికొండ: ఎరువుల బ్లాక్ మార్కెట్‌కు నిరసనగా అన్నదాతల కోసం మంగళవారం గుంటూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు (డైమండ్) తెలిపారు. రాష్ట్రంలో అన్నదాతలు ఎరువుల కోసం రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని.. ఇందుకు కూటమి ప్రభుత్వమే కారణమని ఆయన మండిపడ్డారు. ఈ దుస్థితిని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న కలెక్టరేట్ల ముట్టడిలో భాగంగా గుంటూరు కలెక్టరేట్ ఎదుట ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమం జరగనుందని అన్నారు. రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కార్మికులు సంఘటితంగా పోరాటం చేయాలి



మంగళగిరి టౌన్: కార్మిక వర్గం సంఘటితంగా శ్రమ దోపిడికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు చెంగయ్య అన్నారు. సోమవారం మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షులు డి.శివ అధ్యక్షత వహించారు. చెంగయ్య మాట్లాడుతూ.. కార్మికులు తమ సమస్యలను సమష్టిగా పోరాడి పరిష్కరించుకోవాలి తెలిపారు. విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయడానికి కృషి చేయాలని అన్నారు. 2026 జనవరి 4వ తేదీన విశాఖపట్నంలో భారీ బహిరంగ సభకు మంగళగిరి ప్రాంతం నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షులుగా డి.శివ, కార్యదర్శిగా ఎం.రవి, సహాయ కార్యదర్శిగా కృష్ణ ఎన్నికయ్యారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మంగళగిరి టౌన్: మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అడిషనల్ కమిషనర్ కె.శకుంతలకు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఆప్కాస్‌లో పని చేస్తున్న 25 మంది పారిశుద్ధ్య కార్మికులను 60 ఏళ్లు నిండాయని తొలగించడం దారుణమని అన్నారు. కనీసం వారి కుటుంబ సభ్యులునైనా పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యను వెంటనే పరిష్కరించాలని.. లేకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, ఎం.రవి, వేముల దుర్గారావు, తాడేపల్లి రూరల్ నాయకులు పల్లె కృష్ణ, మంగళగిరి పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరియమాత జన్మదినోత్సవం



దివ్యపూజాబలి నిర్వహిస్తున్న విశ్రాంత మేత్రాసన గురువులు గాలిబాలి



ప్రార్థనలో పాల్గొన్న విశ్వాసులు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండ దిగువ ప్రాంతంలో పరిశుద్ధ మరియమాత జన్మదినోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన దివ్యపూజాబలి కార్యక్రమంలో విశ్రాంత మేత్రాసన గురువులు గాలిబాలి పాల్గొని వాక్యోపదేశం చేశారు. మరియతల్లి ప్రభువైన ఏసుక్రీస్తుకు జన్మనిచ్చిన పుణ్యమూర్తి అని అన్నారు. కష్టాల కడలి నుంచి విశ్వాసులను పునీతులను చేస్తోందని వివరించారు. ఏసుక్రీస్తు దీవెనలు ప్రతి కుటుంబం అందుకోవాలంటే అది మరియమాత ప్రార్థన ద్వారా సాధ్యమవుతుందన్నారు. ప్రతి మానవుడు తన జీవితంలో ఎన్నో కష్టాలు, బాధలు, శ్రమల ద్వారా అనేక పాఠాలు నేర్చుకుంటాడని చెప్పారు. బాధలు, కష్టాలు తొలగాలంటే మరియమాత ప్రార్థన ద్వారా సాధ్యమవుతుందన్నారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. కార్యక్రమంలో బాల ఏసుదేవాలయ విచారణ గురువు ఎం.ఫాతిమా మర్రెడి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన విచారణ గురువులు, మఠకన్యాస్త్రీలు, కథోళిక క్రైస్తవులు, గుడిపెద్దలు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ



బోనస్ పంపిణీ చేస్తున్న దృశ్యం

తెనాలి: సంగం డెయిరీ పాడి రైతులకు పలు సేవలను అందిస్తున్నట్టు డెయిరీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి పర్వతనేని అనిల్‌కుమార్ చెప్పారు. రూరల్ మండలం పెదరావూరులోని పాల ఉత్పత్తి కేంద్రంలో జరిగిన సోమవారం రైతులకు పాలధరల వ్యత్యాసం (బోనస్) పంపిణీ చేశారు. సంగం డెయిరీకి పాలుపోస్తున్న మొత్తం 212 పాల ఉత్పత్తిదారులకు రూ.3.49 లక్షలను బోనస్‌గా అందజేశారు. 3 లక్ష 49 వేల రూపాయలను బోనస్‌గా అందజేశారు. పాడి పశువుల పోషణలో రైతులకు అవసరమైన సూచనలు చేశారు. సెక్స్ సార్టెడ్ సెమెన్ వినియోగించటం ద్వారా ఆడ దూడలు మాత్రమే పుడతాయనీ, తద్వారా పాడి పెరుగుతుందని అన్నారు. సంగం డెయిరీకి పాలు పోస్తున్న పాల ఉత్పత్తిదారులకు డెయిరీ నుంచి అనేక సేవలు అందిస్తూ రైతుల ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతున్నట్టు సీనియర్ మేనేజర్ పాతూరి ఆదినారాయణ, డెయిరీ పాలకవర్గ సభ్యుడు శాఖమూరి వెంకటేశ్వరరావు, పాల ఉత్పత్తిదారులు కందేపి వెంకటేశ్వరరావు, పాలడుగు వెంకట కృష్ణారావు, ఆలూరి అంజయ్య, మాదల సాంబశివరావు, కొడాలి సుధాకర్ పాల్గొన్నారు.

గుడివాడలో...

గుడివాడ గ్రామంలోని 99 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.1.69 లక్షలను బోనస్‌గా పంపిణీ చేశారు. సోమవారం గుడివాడ సంఘ అధ్యక్షుడు బొద్దులూరి సుబ్బారావు, సంగం డెయిరీ మేనేజర్ బండ్లమూడి శ్రీకాంత్, కావూరి చంద్రమోహన్, గ్రామ సర్పంచ్ యడ్లపాటి రాకేష్, డెయిరీ అధికారులు, సంఘ పాలకవర్గ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో 'హరిహంసిక'కు పతకాలు



పతకాలను సాధించిన విద్యార్థులు

తెనాలి: తెనాలికి చెందిన హరి హంసిక డ్యాన్స్ అండ్ తైక్వాండో ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో పలు బంగారు పతకాలను సాధించారు. ప్రకాశం జిల్లా ఉప్పుగుండూరు లోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో ఆదివారం 7వ జాతీయ స్థాయి సమురాయి, జపాన్ కరాటే, రాష్ట్రస్థాయి సెలభమ్ టోర్నమెంట్ జరిగింది. రోజంతా జరిగిన ఈ పోటీల్లో తెనాలిలోని హరి హంసిక డ్యాన్స్ అండ్ టేక్వాండో ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని విభాగాల్లోనూ ప్రతిభను చాటి 15 బంగారు పతకాలు, అయిదు రజత పతకాలు, మరో అయిదు కాంస్య పతకాలను సాధించారు. పాఠశాల యాజమాన్యం సత్యనారాయణ, టోర్నమెంట్ నిర్వాహకులు కావూరి నరేందర్ రెడ్డి హరిహంసిక విద్యార్థులను అభినందించారు. అలాగే, తెనాలి లో సెలభమ్ కోచింగ్, ఆర్గనైజింగ్ బాధ్యతలను కోచ్ ఎం.చిన్న కేటాయించారు.

కిట్లు వైద్యశాలకు రావాలి

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో హెచ్ఐవీ కిట్ల కొరత ఉందని వాటిని ప్రభుత్వం పంపిచేలా చర్యలు తీసుకోవాలని రాజీవ్ యువసేన సేవా సంఘం అధ్యక్షుడు వి.సూరిబాబు ఒక ప్రకటనలో కోరారు. 1982వ సంవత్సరం నుంచి స్వచ్ఛంద సంస్థ ద్వారా హెచ్ఐవీ రోగులకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. కొందరూ ఉద్యోగులు కావాలని కొరత సృష్టిస్తున్నట్లు ఆరోపించారు. దీనిపై జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణిని వివరణ కోరగా తెనాలి జిల్లా వైద్యశాలలో సంఘటన నెలకు ఐసీటీసీ పరీక్షలు 1500, పీపీటీసీ పరీక్షలు 700 వరకు చేస్తున్నట్లు చెప్పారు.

వయోజనులకు విద్య నేర్పేందుకే విద్యా కేంద్రాలు



తాడికొండ: వయోజనులంతా విద్య నేర్చుకోవడం ద్వారా మరింతగా వారి ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు ఉపయోగపడుతుందని.. అందుకోసం ప్రభుత్వం వయోజన విద్యా కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని వయోజన విద్యా ఉప సంచాలకులు కె.ఆంజనేయులు అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అక్షరాస్యతా దినోత్సవం, వాలంటీర్ల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం వయోజన విద్య కోసం భారీగా నిధులు వినియోగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో–2 ప్రభాకర్, వయోజన విద్యా పర్యవేక్షకులు దాసరి వెంకటస్వామి, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సాంబశివరావు, ఏపీఎం సాంబశివరావు, ప్రాజెక్టు మేనేజర్, డీఆర్పీఏ సీసీలు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటనపై తెనాలి జీఆర్పీ ఇన్‌చార్జి ఎస్ఐ ఎల్. సరస్వతి కేసు నమోదు చేశారు. ఆమె వెల్లడించిన వివరాల ప్రకారం సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తెనాలి–బాపట్ల రైలు మార్గంలో నిడుబ్రోలు స్టేషసన్ సీపంలో ఉన్నట్లు అందిన సమాచారంతో ఘటన స్థలాన్ని జీఆర్పీ సిబ్బంది పరిశీలించారు. సుమారు 40 సంవత్సరాల వయస్కుడు రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లుగా భావిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బకాయిలను వెంటనే విడుదల చేయాలి

దుగ్గిరాల: రాష్ట్ర వ్యాప్తంగా ఇమామ్, యోజనులకు ఇచ్చే గౌరవ వేతనాల బకాయిలను సత్వరమే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు షేక్ సుభానీ తెలిపారు. సోమవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడం వల్ల 2024 ఏప్రియల్, మే, జూన్ నెలల వేతనాలు చెల్లించడంలేదన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ముస్లింల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పెళ్లి చేయాలంటూ టవర్ ఎక్కి.. హల్‌చల్

తెనాలిరూరల్: మద్యం మత్తులో సెల్ టవర్ ఎక్కి ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పాండురంగ పేటకు చెందిన అశోక్ గతంలో బొబ్బిలి ప్రాంతం నుంచి తెనాలి వచ్చి తాపీ పనులకు వెళుతున్నాడు. ఈ క్రమంలో ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ, సహజీవనం చేస్తున్నాడు. స్థానికంగా మరో బాలికను ప్రేమించానని ఆమెతో పెళ్లి చేయాలని కోరుతూ సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో సెల్ టవర్ ఎక్కి నానా హడావుడి చేశాడు. మద్యం మత్తులో ఉన్న అశోక్‌కు ఎంత మంది నచ్చజెప్పినా ఒంటిగంట వరకు టవర్ దిగలేదు. చివరికి త్రీ టౌన్ పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో టవర్ దిగివచ్చిన అశోక్‌కు స్థానికులు దేహశుద్ధి చేశారు. పోలీసులు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ తరలించి విచారణ చేపట్టారు.

ఘనంగా వేళాంగిణి మాత జన్మదినోత్సవం

తెనాలిరూరల్: వేళాంగిణి మేరీ మాత జన్మదినోత్సవాన్ని మండలంలోని అంగలకుదురులో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి వద్ద వితంతువులు, పేదలకు బియ్యం, కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. చర్చి గురువులు ఉపదేశకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్



తాడేపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏఐకేఎస్) సీపీఐ పిలుపులో భాగంగా సోమవారం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులకు యూరియా సకాలంలో అందించాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎరువుల కొరతకు ప్రభుత్వం వెంటనే పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎరువుల కొరత లేదని చెప్పడం సరికాదన్నారు. రైతుల వద్దకు వచ్చి యూరియా కొరత ఉందో లేదో చూడాలన్నారు. అనంతరం తాడేపల్లి తహసీల్దార్ డి.సీతారామయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు ముసునూరు సుహాస్, తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మంగళగిరి నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు గుంటక సాంబిరెడ్డి, రైతు నాయకులు పెద్దిశెట్టి వీరాస్వామి, తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, సీనియర్ నాయకులు మానికొండ డాంగే, శ్యామ్, బాషా, అలీ, రాజు, దొంత కోటేశ్వరరావు, ప్రసాద్, చిన్న, కూరపాటి సింగయ్య, మన్నవ హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి చేరుతున్న మురుగు

సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి నేతాజీ



గుండిమెడలో మురుగును పరిశీలిస్తున్న నేతాజీ తదితరులు

తాడేపల్లి రూరల్: పారిశుద్ధ్యం సక్రమంగా లేకుండా, రోడ్లపైకి వచ్చి చేరుతున్న మురుగు నీరును అరికట్టి, మురుగు సమస్యను పరిష్కారం చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామంలో సీపీఎం నాయకులతో కలిసి ఆయన మురుగు నీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోతోందని వాపోయారు. దీంతో దోమలు అధికంగా ప్రబలుతున్నాయని అన్నారు. తక్షణమే గ్రామ సచివాలయ అధికారులు మెడింగు జూనియర్ కాలేజీ వద్ద ఉన్న మురుగు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కాలనీ వాసులు

ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి, గుండాలపాడు అగ్రహారం గ్రామాల మాలదాసుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు అర్జీ అందజేసినట్లు వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఈమని అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లోని కాలనీ వాసులు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీలో 250 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారని చెప్పారు. తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. సరైన శ్మశాన స్థలం లేక అధికారులకు అర్జీలు ఇచ్చినా ఫలితం లేదని అన్నారు. ఇల్లు లేని నిరుపేదలు ఉన్నారని, వారికి స్థలాలు కేటాయించాలని చెప్పారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, దారా సుబ్బారావు, ఎం.కోటేశ్వరమ్మ, చెవుల నాగరాజు, దారా మల్లేశ్వరరావులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా ఎరువులు



ఎరువులు పరిశీలిస్తున్న అధికారులు

తాడికొండ: యూరియా, ఇతర ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సరిపడా సరఫరాకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని మండల మానిటరింగ్ కమిటీ సభ్యులైన సీఐ శ్రీనివాసరావు, తహసీల్దార్ హరిబాబు, ఏవో సంధ్యారాణి అన్నారు. సోమవారం తాడికొండ మండలం పెదపరిమి గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడి గ్రామ సభ నిర్వహించారు. తుళ్ళూరు మండలంలో 1400 హెక్టార్లలో పత్తి, 80 హెక్టార్లలో వరి సాగు జరుగుతుందని.. వీటికి 750 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమన్నారు. ఇప్పటికే మండలంలో 500 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామని తెలిపారు. అనంతరం గ్రోమోర్ కేంద్రంలోని యూరియా, ఇతర ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.